# గజ్వేల్‌లో గెలిచేది సీఎం అయ్యేది కేసీఆరే..



బీఆర్ఎస్‌లో చేరిన అడవిమజీద్ గ్రామానికి చెందిన మైనార్టీ యువకులతో మంత్రి హరీశ్‌రావు

- ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు
- అద్భుతంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం
- అర్హులందరికీ త్వరలో న్యాయం చేస్తాం
- యువతకు ఉద్యోగ ఉపాధి శిక్షణ
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 31: గజ్వేల్ నుంచి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచేది, హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేది కేసీఆరే అని, అందుకు ప్రతి కార్యకర్త తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి నెల రోజులపాటు ప్రజలకు వివరించాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధికి బృహత్ ప్రణాళిక ఉందని, సీఎం కేసీఆర్ సహకారంతోనే గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో పట్టణ రూపురేఖలు మార్చుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని, సీఎం కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలను పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో పేదల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను తీసుకువచ్చారన్నారు. గజ్వేల్ దవాఖాన పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నదన్నారు. దేశంలో ఎక్కడా లేనంతగా ఆర్ అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన 5, 10 శాతం పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా కొంత మంది అర్హులు లబ్ధిపొందేవారు ఉన్నారని, చెక్కుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు, కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించి పూర్తి చేస్తామన్నారు. ఇంకొంత మందికి ఇంటి స్థలాలు వచ్చేది ఉందని, వారందరి త్వరలోనే అందిస్తామన్నారు. యువతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. మనందరికీ పెద్ద దిక్కుగా సీఎం కేసీఆర్ ఉన్నారని చెప్పారు.

### రాష్ట్రంలో బీజేపీ వచ్చే పరిస్థితి లేదు


ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ వచ్చే పరిస్థితి లేదని, వారు ప్రజలకు చేసేదేమీ లేదని మంత్రి ఎద్దేవా చేశారు. వారిని నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్టేనన్నారు. దుబ్బాకలో ఎమ్మెల్యే రఘునందన్ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని, అందులో ఒక్కటంటే ఒక్కటి నెరవేర్చారా అని ప్రశ్నించారు. ప్రజలకు మాటలు చెప్పే వాళ్లు కాదు చేతలు చేసే వాళ్లే కావాలన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఒకటి, రెండు సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దేశంలో అత్యధికంగా పింఛన్లు ఇస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ఝూఠా మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గజ్వేల్ ప్రజలు సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అభ్యర్థించారు. లక్షకు పైగా మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో నాయకులు, కార్యకర్తలు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణశర్మ, రైతుబంధు సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవీ రవీందర్, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులున్నారు.

### ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

గజ్వేల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. గజ్వేల్ పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు అత్యధికంగా గజ్వేల్ మున్సిపాలిటీ నుంచి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. గతంలో ఉన్న గజ్వేల్, ప్రస్తుతం కనిపిస్తున్న గజ్వేల్‌కు ఎంతో తేడా ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్ కృషి, పట్టుదలతోనే ఇంతటి అభివృద్ధి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇన్‌చార్జీ మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు



## బీఆర్ఎస్‌లో చేరికలు

ములుగు మండలం అడవిమజీద్ గ్రామానికి చెందిన మైనార్టీలు కాంగ్రెస్ పార్టీని వీడి మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పని చేయాలన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, షాదీముబారక్ పథకాన్ని అమలు చేయడంతో పేద ముస్లింలకు ఎంతో న్యాయం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, నాయకులు జుబేర్‌పాషా, అర్జున్ గౌడ్, కొన్యాల బాల్‌రెడ్డి తదితరులున్నారు.

# ఔర్ ఏక్ దక్కా.. దేడ్ లాక్ పక్కా

- సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదు
- చేసింది చెబుదాం.. ఓటు అడుగుదాం
- సిద్దిపేట ప్రజల గౌరవాన్ని నిలబెట్టాం
- దుబ్బాకలో ప్రభాకరన్నను గెలిపించే బాధ్యత మనదే..
- ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 31: సిద్దిపేట ప్రజల గౌరవాన్ని నిలబెడుదాం.. చేసింది చెబుదాం.. ప్రజలు కోరే అభివృద్ధి చేసుకున్నాం.. ప్రేమతో ప్రజలను ఓటు అడగండి.. మ్యానిఫెస్టోను వివరించండి.. అని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో మంగళవారం పద్మనాయక, బాలాజీ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. సిద్దిపేటలో మనకు ఏపార్టీతో పోటీ లేదని.. మనకు మనకే పోటీ అన్నారు. ఎక్కువ శాతం ఓట్లు తెచ్చిన మండలానికి బహుమతి ఇస్తాన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదన్నారు. కేసీఆర్ బీమాతో కోటి కుటుంబాలకు ధీమా అందబోతున్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్న దుర్భర పరిస్థితుల గురించి ఓటర్లకు చెప్పాలన్నారు. ఛత్తీస్‌గడ్‌లో ఎకరాకు 13 క్వింటాళ్ల వరకే కొంటారు.. మనదగ్గర ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజల మధ్యే ఉండాలన్నారు. 16,000 మందికి పార్టీ తరఫున డ్రైవింగ్ లైసెన్స్ అందించినట్లు తెలిపారు. పదివేల కుట్టు మిషన్లు ఇచ్చామన్నారు.

### మెజార్టీతో పోటీ పడతాం

ఐదేండ్లుగా అభివృద్ధి చేశారు, అండగా ఉన్నారు, ఈ నెల రోజులు మీ గురించి కష్టపడతాం. మేము పోటాపోటీగా ప్రచారం చేస్తామని ముక్తకంఠంతో బీఆర్ఎస్ కార్యకర్తలు నినదించారు. రాష్ట్రంలో చీడ పురుగులు తిరుగుతున్నాయి. అలాంటి చీడ పురుగులను తరిమివేయాలంటే.. బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించాలి. సిద్దిపేటలో మేము మీ గురించి పని చేస్తామంటూ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ముక్తకంఠంతో నినదించారు. ఈ ఎన్నికల్లో కష్టపడి మరోసారి లక్ష మెజార్టీ దాటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటీ రోజా రాధాకృష్ణ శర్మ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, ఎంపీపీలు మాణిక్యరెడ్డి, శ్రీదేవీచందర్‌రావు, ఒగ్గు బాలకృష్ణ యాదవ్, జడ్పీటీసీలు శ్రీహరిగౌడ్, ఉమా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, యాదగిరి, కాముని శ్రీనివాస్, లింగం గౌడ్, ఎల్లయ్య, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బాలకిషన్ రావు, ఎడ్ల సోమిరెడ్డి దువ్వల మల్లయ్య, కుంబాల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

### ప్రభాకర్ అన్నకు అండగా ఉందాం

ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి అలా జరగడం తీవ్రంగా కలిచివేసిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. చిన్న పేగుకు నాలుగు చోట్ల రంధ్రం పడిందని.. 17 సెంటీ మీటర్లు సర్జరీ చేసి చిన్న పేగు తొలిగించారన్నారు. ప్రభాకర్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. సిద్దిపేటలో ఉండే ప్రతి కార్యకర్తకు ఇక్కడ గెలుపు ఎంత ముఖ్యమో ప్రభాకర్ రెడ్డి గెలుపు అంతే ముఖ్యమన్నారు. దుబ్బాకలో గెలిచిన ఎమ్మెల్యే రూపాయి పని కూడా చేయలేదని ఆరోపించారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలని, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేసి అందరినీ కలుపుకొని పోవాలన్నారు. వంద ఓట్ల ఇన్‌చార్జీల పాత్ర ఎంతో కీలకమని.. గత ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించామన్నారు. ఇండ్ల స్థలాలు రాని వారికి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### 'నవ సిద్దిపేట' ఆవిష్కరణ

నవ సిద్దిపేట, పదేళ్ల ప్రగతి పుస్తకాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రగతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ అభివృద్ధిని కండ్లకు కట్టినట్టు పుస్తకంలో పొందుపర్చారన్నారు. ఒక పుస్తకం, ఒక ఫొటో ఎన్నో సమాధానాలకు అర్థమని చెప్పారు.